మెఱుపు మెఱిసింది

శ్రీయుతులు విహారి, శాలివాహన

"అణ్ణి చూసి నీకళ్లలో నిప్పులుపోసుకున్నావ్!'
—మల్లన్నకళ్లు చండ్రనిప్పులు కురిపిస్తున్నాయి.

రెడ్డి బుంగమీసాలమధ్య వో సన్నటి వెలుగురేఖ విరిసి మాయమైంది.

అవహేళన రెడ్డి ఆంతర్యాన్ని సూచించగా; ఆరని వేదన మల్లన్న హృదయాన్ని రంపపుకోత కోసింది. గుండెలోతుల్లో నుంచీ పగ వుప్పొంగింది. "నీ ఎదవ తెలివితేటలు నాకాడనా? ఆస్తికోసం పెళ్లాన్నే పొట్టనపెట్టుకున్న రాక్షసపోడివి; ఈ పని నీది కాదంటే నమ్మేదెవరు? దెబ్బకుదెబ్బతీస్తా చూసుకో! ఈ మల్లన్నమాట కోడెనాగు పగతోసమానం.జాగ్రత్త!"

చుట్టకొసని గోటితో తుంచిపారేసి, చుట్టను పళ్లమధ్య బిగించి వెకిలిగా, వక్రంగా నవ్వేడు రెడ్డి. "అరచేకుక్కలు కరవ్వు మల్లన్నా! నిన్న పోలీసోళ్ల దగ్గరేమైందో ఈ ప్రతాపం?"

రెడ్డిహేళనకు మల్లన్న శరీరం దహించుకుపోయింది. బాధతో నరాలు మూలిగిన్నై; కోపంతో కళ్లు ఎరుపెక్కిన్నై; ఆవేశంతో పెదవులు వణికిన్నై. బాధ, ఆవేశం, కోపం, పగ—అన్నీ ఘనీభవించి మాటల రూపంలో బయటపడిన్నై. "కఱవ్వు; కఱవ్వు! ఆ ధైర్యంతోనే వుండు, మల్లన్నతడాఖా తేలిపోతుంది. పట్నంలో ముండకాడికిపోయి తిరిగొచ్చే ఏలకి నీ గుండెల్లో కునుకు తీస్తాను. కాసుకో!"

రెడ్డి వికటహాసం మల్లన్నను గుడిసెదాకా తరుముకొచ్చి కుక్కి మంచంలో కూలద్రోసింది.

ఆకాశంలో మేఘాలు ఏదోగమ్యానికి చేరేవేళ మించిపోతున్నట్లు పరుగెత్తుతున్నాయి.

మల్లన్నకళ్లల్లో గోపాలం రూపం మెదిలింది.

గోపాలం?—ఇకలేడు!

మహాపర్వతభారానికి హృదయం గీపెట్టింది. కళ్లురెండూ రెండు తటాకాలుకాగా, అణగారిపోతున్న గుండెను ఊర్పుతో విస్తృతం చేసేడు. కన్నకొడుకు గతకాలపు కథలు ఒక్కొక్కటిగా మనసును ముసురుకోసాగేయి.

'దున్నల్ని తోలుకుపోయి చెఱువులో కడుక్కురారా'అంటే; 'నేను బడికెళ్లి సదువుకుంటానే' అని అమాయకపుముఖం పెట్టినగోపాలం!—

'సదివిందిసాలుగాని, ఎల్లి ఆ నిమ్మతోటకి ఏతామేస్తా వుండు'అంటే; 'కాదయ్యా. పట్నంపోయి పై క్లాసులోచేరతాను. నీకెందుకు? రోజూ ఈడనుంచే మూడుమైళ్లూ నడిచిపోయొస్తూ వుంటాగా' అని తనని ఒప్పించి హైస్కూల్లోచేరి'ఎస్సెల్సీ'ప్యాసైన గోపాలం!—

నాలుగేళ్లల్లో పల్లెలో ఆబాలగోపాలానికీ తలలో నాలుకైపోయి, పాతికేళ్లు నిండకుండా ప్రసిడెంటు గిరీ పొందిన గోపాలం!—

'ఎంతమందెట్టా ఏడ్చినా, 'ఎలక్షన్లలో గెలిచానయ్యా!' అనివచ్చి తనకాళ్లకు దణ్ణంపెట్టిన గోపాలాన్ని చూసి తను కొండెక్కినంత సంబరం పొందేడు. ఏంలాభం? ఏడాది తిరక్కుండానే ఆడిబ్రతుకు తెల్లారిపోయింది,తన ఆశలదీపం నిజంగానే కొండెక్కిపోయింది. గోపాలంకసలు జనంవత్తాసెక్కువౌతున్నకాడనుంచీ ఏడుపుగానే వుంది, ఆయెదవనాయాలు రెడ్డికీ, ఆడి ముఠాకీ. ఆనాటికానాడు—లచ్చిగాడిగట్టు తగాదా రోజున—గోపాలాన్ని బరిసెతో పొడిపించాలని ప్లానేయలా రెడ్డి? రాముడికి లచ్మనుడిలా గోపాలానికి నారిగాడు అండగావుండబట్టి ఆ గండం గడిచింది. లేకపోతే, ఆ రోజునే గోపాలాన్ని మ్రింగేవాడు రెడ్డి!

'హుఁ......రెడ్డి!—వాడిసంగతి యియ్యాల్టితో తేల్చేయాలి—అఱిచేకుక్కలు కఱువ్వా?'

మల్లన్నపళ్లు పటపటలాడినై.

'కరుస్తయ్యో లేదో అనుభవం సేసిసూపుతా' ఎదవన్నర ఎదవకి తనసంగతేం తెలుసు? ఏందో బండి తోలుకుబతికే మల్లన్నేగందా అనుకుంటున్నాడు!— గుండెలుదీసిన రౌడీఎదవనే నేనూ అనే యిసయం ఆడికి తెలవదు!

'రౌడీవెధవని' అనుకునేసరికి ఛాతీపెరిగింది మల్లన్నకు. శరీరంలోకి ఏదో క్రొత్తశక్తి ప్రవేశించింది. మంచంమీద లేచికూర్చున్నాడు. కుడిచేత్తో కళ్లు తుడుచుకుని చుట్టూచూసేడు.

అప్పటికప్పుడే ప్రొద్దువాటారింది. ఆకాశం నిండా నల్లటిమేఘాలు దట్టంగా క్రమ్ముకొస్తున్నాయి. పక్షి ఒకటి ఏదో ఎఱ్ఱటిపండును కఱచుకుని ఉత్తరదిశగా ఎగురుతూ పోతున్నది. మల్లన్న పడుకున్నమంచానికి ప్రక్కగావున్న ములగచెట్టుమీది కాకి అదేపనిగా అరుస్తున్నది.

''నీకేంపొయ్యే కాలఁవొచ్చిందే, అట్టా అరుస్తుండావ్?''అని విసుక్కుని గుడిసెలోకి దృష్టి సారించేడు.

రత్తి పొయ్యిలో తలదూర్చి నిప్పును వూదుతున్నది. అరచేతులురెండూ నుదుటికానించుకుని గొంతుక్కూర్చున్నాడు నారాయణ.

మల్లన్న మంచంమీదనుంచీ లేచాడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ గుడిసెలోకి వచ్చాడు.

రత్తిప్రక్కకువచ్చి నుంచున్న తండ్రిని తలెత్తి చూసేడు నారాయణ. మల్లన్న గూట్లోవున్న ముంత అందుకుంటూ వుండగా ఆ అలికిడికి యిటుతిరిగింది రత్తి.

''ఏడకిపోతావయ్యో, డబ్బులు తీసుకుంటున్నావ్? పొద్దుగూకింది''

రత్తిమాటల్లో ధ్వనించిన భయాన్ని నారాయణ మాత్రం గమనించగలిగేడు.

''నాకియ్యాల కూడుసొక్కదుగానీ మీరిద్దరూ తినండి.'' అంటూ ముంతను గూట్లో పెట్టేసి అవతలికి నడిచేడు మల్లన్న. గుడిసెబయటకు వెళ్తున్న తండ్రివైపు అదోలాచూసి, చూపులు మరల్చుకున్నాడు నారాయణ. మల్లన్న పెద్దపెద్ద అడుగులువేస్తూ వెళ్లిపోయాడు. నారాయణలేచి విసురుగా, చిరాగ్గా అటూయిటూ తిరుగుతూ, ''అయ్యకివ్వాళ దయ్యం పట్టింది''అని తనలోతాను అనుకుంటున్నట్లు గొణుక్కున్నాడు.

అన్నం వారుస్తున్న రత్తి అన్నవైపు సాలోచనగా చూసింది. కాని, నారాయణ ఏమీమాట్లాడలేదు.

* * *

శరీరానికి చీకటి కాటుక పులుముకుని కాల పురుషుని తన కౌగిలిలోబంధించింది నిశాదేవి. ఆకాశంలో చుక్కలు మినుకుతున్నాయి. తూర్పునుంచీ దట్టమైన మేఘాలు చుక్కలనిక్కు అణచటానికి తరుముకొస్తున్నాయి.

మాలపల్లెగుడిసెలో ఎక్కడో పసిపిల్ల గీపెట్టి రోదిస్తున్నది. కాలువగట్టుమీది బొమ్మజెముళ్లలో కీచురాళ్లు రొదచేస్తున్నాయి. ప్రక్కనున్న స్మశానంలో నుంచీ నక్క వొకటి వికృతంగా అరుస్తూ పరిగెత్తుకు పోయింది.

మల్లన్న తనుచేస్తున్నపనిని ఆపి, కాళ్లు క్రిందకువేసి వంతెనమీద కూర్చున్నాడు. కుడిచేతి బొటనవ్రేలితో సన్నగా కత్తిమీద స్పృశించాడు.

'మా మాంఛి పదునెక్కింది. ఒక్కఏటు!— స....ఫ్....ఆ'—నాటుసారాతేపులో తేలిపోయిందిమాట. తూలి క్రిందపడబోయి తమాయించుకుని వంతెన దిగేడు.

అడుగు ముందుకుపడేసరికి, ఉత్సాహం మూడు అడుగులు ముందుకునెట్టింది. 'మాణిక్కెం, మాంచి ఘాటుసరుకేసిందియ్యాల. మజాగావుందిలే. రెడ్డి తలనరికితే యింకా మజాగావుంటుంది!—లేకపోతే, 'పోలీసోళ్లకాడ ఏమైందీప్రతాపం?'అంటాడా? ఎదవసచ్చినోడు! డబ్బెదజల్లి కేసుమాఫీ సేయించానుగందా అని గర్వం. ఆడిగర్వం, ఆడిబతుకు యియ్యాల్టితో సరి! అరటిసెట్టులాంటి గోపాలాన్ని పొట్టనపెట్టుకుంటాడా?

'పేణానికి పేణం!'—

'అంతే. దెబ్బకుదెబ్బ!'—

ప్రతీకార వాంఛ ఆవిర్లు గ్రక్కింది. పెదవులు అదురుతున్నాయి; అడుగులు తడబడుతున్నై, మనిషి మత్తులో జోగుతున్నాడు. భూమికి ఆరంగుళాల పైన నాట్యం చేస్తున్నట్లుంది మల్లన్నకు.

కళ్లు నులుముకుని చుట్టూ చూసేడు.

బాటకు ఒకప్రక్కగా వంకతాటిచెట్లతోపు. రెండవవైపు వెలుగు చీకట్లను వేరుచేస్తున్న రైలు కట్ట. ఎదురుగా చీకటిచేస్తున్న పాపాలకు సాక్ష్యాలు తుమ్మలు! రైలుకట్టకావల ఫ్యాక్టరీల మ్రోత; మినుకు మినుకు మంటున్న టౌన్‌దీపాలు!

కాలుసాగింది. సాగుతున్న మల్లన్నకాలికి ఏదో మెత్తగాతగిలింది. వంగి చేత్తో పైకితీసి చూసేడు.

చించిన తెల్లటి గుడ్డపీలిక!

గుండెల్లోని దుఃఖాన్ని స్మృతి బయటకు దేవింది. అప్రయత్నంగా క్రింద కూలబడిపోయేడు మల్లన్న.

'అవును ఇక్కడే! ఇక్కడే నాబాబును పొట్టన పెట్టుకున్నారు'— కైపుతో కెంపులైన కళ్లల్లో కడుపుతీపి సుళ్లు తిరిగింది.

—కాలానికి వేసిన కళ్లెం నిలువలేదు.

మల్లన్నలేచేడు. పరపరలాడినై పళ్లు! బిగపడి పోయినై పిడికిళ్లు! ముందుకుచూసినై కళ్లు!!

గమ్యం ఒక్కటేఅయినా, ధ్యేయం సాధన లాగా చీలిపోయినై కాలిబాట, బళ్లదారీ!

'రెడ్డి చావుకుకూడా యిదే సరయినచోటు!' —మల్లన్న గొణుక్కున్నాడు. 'అడుసేసిన, సేస్తున్న ఘోరాల కియ్యాల్టితోసరి.'

—తుమ్మమొద్దులో దిగబడి పోయింది కత్తి! ఎడంచేయి చెట్టుకు వూతగాబెట్టి బళ్లదారివైపు చూపులు నిగిడ్చేడు. నీరవనిశ్శబ్దంలో తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను తనే వినగలుగుతున్నాడు మల్లన్న.

క్షణాలు గడుస్తున్నాయి.

దూరంగా చిరుగంటలు గలగలలాడినై. మల్లన్న ముఖంలో ఆతృత తొంగిచూసింది. కత్తిని లాగి చేత్తోపట్టుకుని, చెవులురిక్కించి బళ్లదారివెంట చీకట్లోకి చూస్తూ నిలబడ్డాడు.

గంటలశబ్దం దగ్గఅపడుతోంది. మల్లన్న పగ తారాస్థాయి నందుకుంటోంది.

ఉన్నట్లుండి తీవ్రమైన గాలికొట్టింది. గాలికి సుళ్లుతిరిగి లేచినదుమ్ము మల్లన్న మొహానికి కొట్టు కుంది. తుమ్మపూలు, ఆకులు నెత్తిమీద రాలేయి.

'ఛా....ఛా....వానొచ్చేట్టుంది'— విసుక్కుని ఎడమచేత్తో తలను, ముఖాన్నీ తుడుచుకున్నాడు. గంటలమోత ఎక్కువైంది. ఎడ్ల అదలింపుశబ్దం, ఎడ్లు పరిగెడుతున్న సవ్వడీ వినిపించ సాగేయి. మల్లన్న కర్తవ్య నిర్వహణకు ఆయత్తమైనాడు. తుమ్మచెట్టు ప్రక్కన నక్కటానికి ఒక్కడుగు వెనక్కి వేసేడు.

ఆకాశంలో ఉరుము ఉరిమింది. ఎక్కడో పిడుగుపడ్డ ఫెళఫెళారావం!

గుండెలు చిక్కబట్టుకుని కాలు కదల్చేడు మల్లన్న. కుడికాలిప్రక్కగా ఆకులు గలగలలాడినై. సర్రున దూసుకుపోతోంది, నాగు! ఉలిక్కిపడి ప్రక్కకు తప్పుకున్నాడు.

బండిరాక దగ్గఅపడింది. పొంచిపొంచి చూస్తూ కత్తిని పైకెత్తినిలబడ్డాడు.

—తుమ్మచెట్టుప్రక్కకు వచ్చిందిబండి. నొగలో వెనక్కివాలివున్నవ్యక్తి నిద్రమత్తుతో జోగుతున్నాడు. 'రంగాయల్లేవుంది'—మనస్సులోనే మాట్లాడుకున్నాడు మల్లన్న.

బండి ముందుకు కదిలింది., మల్లన్న బండి వెనక్కు నడిచేడు.

ఒకటి!రెండు!! మూడు!!!— అనుసరించేడు. మూడడుగులు వేసేసరికి బండిలో దుప్పటికప్పుకు నిద్రపోతున్న శత్రువు కనిపించాడు.

పళ్లు బిగపడినై, కాలు ముందుకురికింది, ఒకే ఒక్కఅంగ!

ఒక్కటే ఒక్కపోటు! —

కోటిపిడులు నేలకూలేయి.

రెండంగల్లో తుమ్మచెట్టు ఆశ్రయమిచ్చింది. ఊపిరిపీల్చుకుని చేతులు విదిలించుకున్నాడు మల్లన్న!

'ఊరి పీ డొదిలిపొయ్యింది' — పగ చల్లారిన హృదయం పైకి పలికింది.

క్షణాలు గడచినై. మల్లన్న కాలిబాటలో తన గమ్యానికి బయల్దేరటానికి ప్రక్కకు తిరిగేడు. ఆశ్చర్యం!

—ఆరడుగుల దూరంలో రెండు ఆకారాలు! మనస్సు పోల్చుకోవాలని ప్రయత్నించింది. ఆకారాలు దగ్గఱకొచ్చినై. కళ్లుమోసం చేయలేదు. మల్లన్న నిర్విణ్ణుడై పోయేడు. ఇద్దరిలో ఒకడు బళ్లదారి వెంట గ్రామంకేసి వెళ్లిపోతున్నాడు. రెండవ అతను మల్లన్నకు దగ్గఱగా వచ్చేడు.

మల్లన్నకు మాటలు కరువైనై! మెదడుకు పట్టినమత్తు, కళ్లను కప్పిన మైకం దిగిపోయినై!— జరిగిందీ, జరుగుతున్నదీ కలో, నిజమో తెలియని అచేతనావస్థలో వూగిపోయాడు.

"పదయ్యా. ఇంటికిపోదాం."—

మల్లన్న నిలువు గ్రుడ్లేసి చూస్తూ వుండిపోయాడు.

"అవునయ్యా. నిన్నునేను రక్షించు కున్నాను." మల్లన్నచేతిని తనచేతిలోకి తీసుకుని అడుగు ముందుకు వేశాడు.

ఆ కుదుపుకు బహిఃప్రపంచంలో పడ్డాడు మల్లన్న. తనుచేయాలనుకున్న, చేశాననుకున్న పనేమిటో అదేగనుక జరిగివుంటే కలిగే పరిణామాలూ కళ్లకు కట్టినై.

"పోలీసులు, చేతులకు బేడీలు!—ఘోడుఘోడున ఏడుస్తున్న రత్తి, నారిగాడు! — బుంగమీసాలు దువ్వుకుంటున్న రెడ్డిప్రాణం మునసబు!—విచారణ!— ఉరిశిక్ష !—అబ్బ"—

ఆ భయంకర దృశ్యాన్నిచూడలేక తల విదిలించుకున్నాడు. గుండె మహోధృతంగా కొట్టుకుంది. పొడారిన పెదవులు తడుపుకున్నాడు. "నారిగా.... అయితేనువ్వు......."—వేయి సందేహాలు, లక్షప్రశ్నలు మల్లన్న కళ్లల్లో గూడుకట్టుకున్నై.

"నేను ప్రొద్దుట్నుంచీ చూస్తూనేవున్నా నీ యవారం. అన్న పోనేపోయాడు; నేనడ్డుకోలేక పోయాను. నువ్వూ మాకు కాకుండా పోతావని జాగ్రత్త పడ్డా."

మల్లన్న గుండెల్లో ఏదో గురగురలాడింది. తలక్రిందికి వంచుకున్నాడు. వినపడీ వినపడనట్లు అన్నాడు, "నా ఆలోసనంతా సెడింది."

"పోనీ అయ్యా అన్నప్రాణానికి రెడ్డిప్రాణం తీసుకోంగానే పోయిన అన్న మళ్లీ తిరిగొస్తాడా? ఎవరి పాపానికి ఆళ్లుపోతారు! ఎంతమంది రాక్షసపోళ్లు బ్రతకటంలేదీ భూమ్మీద. ఆణ్ణీ బతకనీ.'

మల్లన్న తలెత్తి కొడుకు కళ్లల్లోకి విస్తుపోయి చూసేడు.

కళ్లల్లో అనంతమైన సంతృప్తిని నింపుకుని మళ్లీ అన్నాడు, నారాయణ, "అవునయ్యా...ఆయన్ని బ్రతకనీ."

ఆకాశంలో మెఱుపు మెఱిసింది. మల్లన్న హృదయాకాశంలోనూ మెఱుపు మెఱిసింది!

మెఱిసిన మెఱుపులో బంగరుబాట గోచరించింది. !!